# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 21, ఏప్రిల్, 2015

సమాచార, శాస్త్ర,సాంకేతిక విప్లవాన్ని వైద్య రంగంలో విరివిగా వాడుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. హైదరాబాద్ నగరానికి ఉన్న అనుకూలతలను ఉపయోగించుకొని నగరాన్ని హెల్త్ హబ్‌గా మార్చాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థలు సంయుక్తంగా రాష్ట్రంలో మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. స్టంట్స్‌తో సహా ఇతర మెడికల్ డివైజ్‌లు కూడా రాష్ట్రంలోనే తయారు చేసుకోగలిగితే దిగుమతి చేసుకోవడం ద్వారా ఎక్కువయ్యే వైద్య ఖర్చులను తగ్గించుకోవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిష్ణాతులైన వైద్యులతో హెల్త్ అడ్వైజరీ బోర్డు వేసే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉన్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

మంగళవారం సచివాలయంలో ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణుడు డా. సోమరాజు, డా.కాశీరాజు, డా. కృష్ణారెడ్డి, ఇతర వైద్యులు, అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం ఐదారు కార్పోరేట్ వైద్య సంస్థలు మెరుగైన వైద్యం అందిస్తున్నాయని, ఆ సంస్థలు నగరంలోనే అన్ని హంగులు, అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, మేలైన నిర్వహణతో హెల్త్ క్యాంపస్‌లు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో వారికి ప్రభుత్వం కూడా సహకరిస్తుందన్నారు. నగరంలోని ఇతర ప్రాంతాలు, జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులతో ఈ క్యాంపస్ ఆన్‌లైన్ కనెక్టివిటి కలిగి ఉండాలన్నారు. రోగ నిర్ధారణ, చికిత్స పద్ధతులు, అవసరమైన సలహాలు కూడా ఆన్‌లైన్‌లోనే అందాలని, అత్యవసరమయితే రోగులను క్యాంపస్‌కు తరలించాలని సిఎం చెప్పారు. హైదరాబాద్‌లో ఇలాంటి క్యాంపస్‌లు అన్ని విధాలుగా సిద్ధంగా ఉంటే ఏలాంటి పరిస్థితులలోనైనా మంచి వైద్యం అందించడానికి వీలవుతుందన్నారు. అప్పటికప్పుడు విజృంభించే వాతావరణ సంబంధ వ్యాధులు, అంటువ్యాధులను త్వరగా అరికట్టడానికి, ప్రమాదాలు జరిగి ఎక్కువ మంది గాయపడి ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆదుకోవడానకి వైద్యం, యంత్రాంగం సిద్దంగా ఉంటుందని కూడా వెల్లడించారు.

కార్పోరేట్ సంస్థలు ఈ విషయాన్ని ఆలోచించాలని కోరారు. మంచి వైద్యం అందడంతో పాటు ఆసుపత్రుల్లో ఉత్తమ నిర్వహణ కూడా చాలా ముఖ్యమని సిఎం చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో హెల్త్ అడ్మినిస్ట్రేటర్ల అవసరాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆసుపత్రుల్లో మంచి వైద్యులు ఉండడం ఎంత అవసరమో, ఇతరత్రా వైద్య సేవలు అందడం, మెరుగైన నిర్వహణ కూడా అంతే అవసరమని సిఎం అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం సర్జికల్ ఇనుస్ట్రుమెంట్స్ తప్ప మిగతా చాలా రకాల పరికరాలు, శరీరంలో అమర్చాల్సిన భాగాలన్నింటిని విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని, దీనివల్ల రోగులపై అధిక భారం పడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్ని రకాల వైద్యానికి అవసరవయ్యే మెడికల్ డివైజ్‌లు కూడా ఇక్కడే తయారు చేసే విషయంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించుకున్నామని, తమిళనాడు తరహాలో ప్రభుత్వ వైద్యాన్ని మెరుగ్గా అందిస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేయడానికి స్టేట్ లెవెల్ హెల్త్ అడ్వైజరీ బోర్డు నియమించనున్నట్లు సిఎం చెప్పారు. మెడికల్ కేర్‌తో పాటు మెడికల్ ఎడ్యుకేషన్ కూడా చాలా ముఖ్యమని ముఖ్యమంత్రి అన్నారు. రోగ నిర్ధారణ, చికిత్సల కోసమే కాకుండా అసలు రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా ప్రజలకు ఎప్పటికప్పుడు చెప్పడం చాలా ముఖ్యమని ముఖ్యమంత్రి అన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం